# 6. నాకో తోడు కావాలి

ఇందిర ఉత్తరం రాసింది. ఉత్తరం కాదు, పిడుగు అంటే సబబేమో ! ఎంత ఆశ్చర్యకర విషయాన్ని మోసుకొచ్చిందిది!!—రాసినది మూడు ముక్కలే. నాలుగో వాక్యం 'ఇంతే సంగతులు—' అని !

చాలదూ—గంగిగోవు పాలు గరిటడైనను చాలు !!

ఉత్తరంలో వున్నది రెండు ముక్కలైతేనే, విశేష మనేది ఒకటుంటే చాలు !

ఇందిర రాసింది — 'ఇన్నాళ్ళకైనా ఒక మంచిపని చేశానన్న సంతృప్తి నాలో ఈవేళే మిగిలింది. ఉద్యోగానికి రాజీనామా చేసేసి ఈ పల్లెటూర్లో ప్రశాంతంగా నిట్టూర్పు విడుస్తోంటే ఎంత తృప్తిగా ఉందో తెలుసా ? నువ్వు ఈ వూరికొస్తే తెలుస్తుంది, రాజీనామా చేసికాదు, సెలవు పెట్టిరా ! ఇంతే సంగతులు – నీ ఇందు.'

ఆశ్చర్య పోయినమాట నిజం ! ఇందిర రాజీనామా చేసేసింది !! ఎంత ధైర్యం దీనికి !!!

బి. ఏ. లు పాసయి రోడ్లమీద తిరుగుతున్న లక్షలమంది కథ ఇందుకు తెలియనిది గాదు. తనకు రావాల్సిన ఉద్యోగం కన్నా చాల తక్కువ ఉద్యోగం చేసి, చేస్తూ, ఆత్మ విశ్వాసం కోల్పోయిన 'అండర్ ఎంప్లాయిడ్'ల కథా ఇందుకు తెలుసు—అయినా రాజీనామా !!

ఉత్త ఆవేశం, ఆవేశం మించి మరేమీ కాదు. ఆవేశంలో ఈవేళ రాజీనామా చేసినా, రేపు గురించి ఆలోచన ఎంత భయంకరంగ వుంటుందో ఇందుకు తెలుసు.

అయినా – 'ఈ పల్లెటూళ్ళో ప్రశాంతంగా గాలి పీల్చుకుంటూంటే ఎంతో సంతృప్తిగ ఉంద'ట – ఇదంతా ఆత్మవంచన. ఒకరోజు సెలవు పెట్టమంటే ఏడ్చిపోయే ఇందు ఉద్యోగం వదులుకొని ఆత్మ సంతృప్తిని అనుభవిస్తోందిట – నాన్సెన్స్ అండ్ నథింగ్ బట్ నాన్సెన్స్ !!

అయినా ఆ పల్లెటూరి గురించి నాకు చెబుతోంది ఇందిర ! నిజమే. అది ఇందిర పుట్టిన ఊరు. అలాగని నాది కాదనికాదు, ఇద్దరం అక్కడే పుట్టి పెరిగాము. అక్కడితో కథ ఆగిపోలేదు. ఇద్దరం కలిసి నగరం వచ్చి కాలేజీలో చేరాము – ఇంత జరిగినా. అది ఆ పల్లెటూరి గురించి అక్కడ నిట్టూర్పు విడ్వడంలో గల తృప్తి గురించి చెబుతోంటే నవ్వొస్తోంది ?

అయినా ఒకసారి వెళ్ళొస్తే బాగుంటుంది. – అమ్మను. నాన్నను, బుజ్జిని, వాణిని చూసి చాలా కాలమే అయింది. ఒకసారి వెళ్తే, వీళ్ళం దర్నీ చూసినట్లూ వుంటుంది. ఇందిర కింత పొగరెలా వచ్చిందో అదీ తెలుస్తుంది. అవును వెళ్ళాలి !!

మా ఊరెళ్ళాలనే నిర్ణయం ఒకసారి చేసుకొంటే, అది క్షణ క్షణానికీ దృఢమవుతూనే వస్తుంది కానీ ఆకోరిక చావదు. పుట్టినిల్లన్నా, పుట్టిన ఊరన్నా ఈ జీవుడికింత ఆపేక్ష, ఆప్యాయత ఎందుకో ?

ఏమో. కొన్ని ప్రశ్నలే ఉంటాయి. వాటికీ జవాబులుండవు.

మర్నాడు పొద్దున్నే సెలవుకోసం అప్లికేషన్ ఇస్తోంటే సూపరిం డెంటు నాకేసి అదోలా చూసి నవ్వాడు – "ఏమండి, ఏమిటి సంగతి? ఏమైనా... ?....'

ఆ ఏమైనా అంటే ఆయన ఊహలో పెళ్ళి చూపులు.

'ఉహూ. అలాటివేం లేవండి....' నవ్వుతూ అన్నాను నేను.

'ఆడవాళ్ళకు సిగ్గందం కావచ్చు కాని అబద్ధాలు మాత్రం కావండీ–'

'అవునండీ అబద్ధాలు చెబితే ఆడ పిల్లలు పుడతారంటారు గానీ అబద్ధాలు ఆడ పిల్లలకు అందం అని మాత్రం అనరండీ!_ కదూ సీతాజీ!_' రాజారాం నవ్వుతూ అన్నాడు.

సీతాజీ ఏమిటండీ? నేతాజీలాగ! సీతా అనండి పర్వాలేదు లేకపోతే సీతగారూ అనైనా....'

'సీతగారు ఏమిటండీ పీతగారులాగ...' అన్నాడు రాజారాం. నాకు ఆపుకోలేనంత నవ్వొచ్చింది. పకపకా నవ్వాను.

'ఇదంతా 'ఆపాపతు' లాగానే ఉందే....' రాజారాం గట్టిగనే అన్నాడు.

నాకెంతో సిగ్గనిపించింది. ఆ ఊహ మనసులో మెదలగనే ఎందుకో ఒళ్ళంతా సిగ్గుతో కుంచించుకు పోతోంది. నాకు తెలుసు, నేను ఆడదాన్నని, ఒకరోజు కాకపోతే ఒకరోజు గృహిణిగా మారి, నా కుటుంబాన్ని....ఛ – అప్పుడే అన్నీ మొదలు, పిల్లలు, ఇల్లు ...

ఇందుకే రాజీనామా ఇచ్చిందేమో?

ఏమో_ఆ మొద్దు నాకు తెలీకుండానే—ఎంతకైనా తగును!!

పెళ్ళి సెటిలయిపోయింది కాబోలు, ఉద్యోగానికి రాజీనామా చేసేసింది. ఇంకేముందీ, ఇందిర కథ సమాప్తం కాబోలు–రాస్కెల్!!

ఆవేళ సాయంత్రం బయలుదేరిన నేను యిల్లు చేరేసరికి తెల్లగ తెల్లవారిపోయింది. నేను ముందు ఇందిర యింటికే వెళ్ళాను. యింకా లేవలేదు. ఆ తర్వాత యింటికెళ్లాను' యింటికి అకస్మాత్తుగా వెళ్లేసరికి, అమ్మా, నాన్న ఆశ్చర్యపోయారు. బుజ్జీ. వాణీ సంతోషించారు.

ఇందిరొచ్చింది కొంతసేపటికి. పలుకరించాను – 'అరికాదే కాకితోనైనా కబురంపక ఏమిటే ఈ రాక?...' అడిగింది ఇందిర.

'పట్నంలో ఆ గాలి పడటం లేదే! పల్లెటూళ్లో ప్రశాంతంగా గాలి పీల్చుకొంటూ ఆత్మ సంతృప్తితో కాలం గడుపుదామని! అంతే

'నీకు ఒళ్లు పొగరే సీతా!'

'నాకా? ఛ! ఏదే? నీకున్నదాంట్లో సగమేగా నాకున్నది! నువ్వు రిజైన్ చేసి వచ్చావు! నేనైతే సెలవుపెట్టి వచ్చా'

అమ్మ ఆశ్చర్యపోయి అడిగింది – 'ఆదేమిటమ్మా, నువ్వు రిజైన్ చేశావా?

'అవునండీ, అమ్మ మీకు చెప్పలేదా?'

'నువ్వే చెప్పలేదుగానీ అమ్మ చెప్పలేదా అని అడుగుతావేం?' నిష్టూరంగ అంది అమ్మ.

'ఏం లేదులెండి—ఈమధ్య యింటి కెవరొచ్చినా యిదేసోది—'

'ఔనుగానీ, ఎందుకూ రిజైన్ చేసింది? నేను అడుగుదామనుకున్న ప్రశ్న యిది. అమ్మ లడిగింది.

'ఉద్యోగం అంటే విసుగొచ్చిందనుకోండి, వెధవ ఉద్యోగం...'

ఈ జవాబు అమ్మకోసం. నాకయితే యింకో జవాబు వచ్చివుండేది. నాకా నమ్మకం వుంది. తెలుసుకోవాలి—ఎందుకు తొందర పడిందో? బహుశా....

'ఇందూ పెళ్లేదయినా సెటిలయిందేమిటి?'

'నీకా? నాకా?'

అమ్మ నవ్వింది ఇందిర యిచ్చిన జవాబుకు'. 'నీ మాటా నిజమే తల్లీ దీనికి చెయ్యాలి'

'యింతకీ నీ సంగతి చెప్పవేం?'

'పెళ్లీ లేదు, పెటాకులూ లేదు'

'పెళ్లి లేదు? అయితే మరింకేమిటి?'

కథా నిలయం
3742
శ్రీకాకుళం

ఇందు తొందరపడింది నిజం!!

పెళ్లి కాక, ఉన్న ఉద్యోగానికి నీళ్లొదులుకొని ఇందిర ఏంచేస్తుంది?

ఏమిటి దీని ఉద్దేశం? యిక్కడ ఉండదలుచుకొన్న నాలుగు రోజులలోగా ఈ విషయం తేల్చుకొని వెళ్లాలి. నా పిచ్చిగానీ యింకో గంటకు ఇందిరే చెప్పేస్తుంది!!

కాఫీ తాగి ఇందిర వాళ్ల యింటికి బయలుదేరాము. యింట్లో కెళ్లేసరికి ఇందిర వాళ్లమ్మగారు పిలిచారు నన్ను 'సీతమ్మ తల్లీ మాట! నువ్వు ఇందిరకు పంచప్రాణాలు కదూ! కొంచెం దానికేమొచ్చిందో కనుక్కో- మాయరోగం! ఒక్క ముక్క- అంటే ఒక్కముక్క- చెప్పి చేసుండకూడదూ అసలేదో',?

విసురుగ అంది ఇందిర 'యిదిగో అమ్మా ఆఖరిసారిగ చెబుతున్నా—మాయరోగం, పెద్దరోగం నాకే వచ్చాయి అనిచెప్పాగా! ఇంకా అందరితోటీ ఎందుకీ ప్రస్తావన?'

'నీకు సీత. 'అందరూ'టే?'

'కాదు-నాకు అందరూ సీతే! నీ ఘోష అంతా సీతతోటిచెప్పుకో. అంతేగానీ యింకెవరితోనైనా అన్నావంటే మాట దక్కదు—' ఎంత విసురుగ అందో, అంత విసురుగనే వెళ్లిపోయింది ఇందిర.

నేను, ఇందిర వాళ్లమ్మగారు యింకా ఆ షాక్ నుంచి తేరుకోటుండానే, మళ్లీ వచ్చింది ఇందిర — 'యిదిగో సీతా! మాట. ఒక గంటో రెండుగంటలో రామాయణమంతా వినిరా! నేను మీ యింట్లోనేఉంటాను. సరేనా?'

వెళ్లిపోయింది ఇందిర.

నా మనసెందుకో గాయపడింది. ఇక ఇందిర వాళ్లమ్మసంగతి....

'విన్నావా సీతా! ఆ విసురూ, ఆ పొగరూ...'

'లేదులేండి. ఇందిర అలాటిది కాదు—'

'లేదులే ఇందిర మారిపోయింది. నీకా సంగతి తెలీకపోలేదు!'

క్షణం ఆగి అన్నాను 'యింతకీ ఎందుకండీ ఆ విసురూ,పొగరు..'

'యిదేమిటి? దీని పొగరులో యిది వందో వంతైనా లేదనుకో! అయినా చూడు సీతా, కన్నవాళ్లంగదా, ఉద్యోగానికి రాజీనామా చేయదల్చుకొన్నది ఒక్క ముక్క మాతో చెప్పి ఉండకూడదూ? ఉహూ— యింటికొచ్చేంతవరకూ మాకూ తెలీదనుకో! ఎన్నాళ్లు పెట్టావే సెలవు అంటే సెలవేమిటే, ఉద్యోగం వదలి వచ్చేశానంది ఆ గుండెలు తీసిన బంటు. అయినా ఎందుకో నీకు తెలుసా?'

ఆశ్చర్యపోయాను— ఏమిటి కారణం? తల్లికీ, తండ్రికీ కూడ చెప్పకుండా....

'నాకేం తెలిదండీ....'

'పోనీ, గొడవేదైనా జరిగిందా అనికూడ అడిగాను. అలాంటివేం లేవే అంది. గొడవా లేక, బాధాలేక ఎందుకొచ్చిన మాయరోగం ఇది'

నిజమె — ఏదైనా గొడవ జరిగిందేమో!

ఏదైనా గొడవ అన్నా— అదేగా!బహుశా ఏ ప్రేమపలలోనైనా చిక్కుకొని పోయిందేమో! బయటకు రాలేక, బాధ భరించలేక- ఏమో ఒకవేళ అదే కారణ మయితే, రాజీనామా మాత్రం సమాధానం కాదు - అది సమస్యనుంచి పారిపోయే తత్త్వం.

'నేను కనుక్కుంటాలేండి అసలేం జరిగిందో?' అన్నాను. ఆవిడను వోదార్చే ప్రయత్నంలో. కానీ అది మిస్‌ఫైర్ అవుతుందని నాకేం తెలుసు? ఇందిర వాళ్లమ్మగారన్నది నాకు షాక్‌లా తగిలింది -ఏమైనా జరిగే ఉంటుందంటావా?'

ఏమో, ఏం చెప్పగలం? అందామనుకొన్నాగానీ అనలేదు.

'కాదు సీతా. దీన్నోమ్మయింటి దాన్నిచేసి చేతులు దులుపుకుందామని ఎన్నేళ్ళనుంచి ప్రయత్నిస్తున్నామో నీకు తెలీందిగాదు. ఇన్ని సంబంధాలు చూసినా, మా దురదృష్టమో ఏమో, ఒక్కటంటే ఒక్కటి కుదిరి చావడం లేదు. వచ్చే మంగళవారంనాడేమో బెజవాడనుంచి ఇంకోళ్లు వస్తున్నారు, దీన్ని చూడ్డానికి సెలవుపెట్టి రమ్మని ఉత్తరం రాద్దామనే సరికి వచ్చేసింది .... కనీసం ఇదైనా కుదిరిపోతే ...

నేనేం వినడం లేదు —కాదు నా కసలు వినిపించడంలేదు.

వచ్చే మంగళవారం.... ఈ వేళ గురువారం. అదైనా కుదిరితే ... అయినా ఎన్ని సంబంధాలు చూశారు. ఒకటా? రెండా? ఎంతలేదన్నా ఒకపది.... ఇంతమంది పెళ్ళి చూపులకు వచ్చినా ఒక్కడంటే ఒక్కడు ఇందిరను చేపట్టడానికి సిద్ధపడలేదు. తమాషాగా ఉంది! ఇంతకన్నా తమాషా బహుశా మొదటిసారి ఇందిరను చూడ్డానికి వచ్చిన అతనే. ఇందిరను చూసి, దాని చెల్లెల్ని, దానిపేరేమిటె ?... జయంతి, ఊం జయంతిని చేసుకుంటాననడం!

ఎంత ఆశ్చర్యంగా ఉంది అది ఈ వేళ తలుచుకొన్నా సరే! ఇందిరకు ఇంకా ఇరవై అయినా వచ్చివుండవేమో ఇందిరను చూడ్డానికి ఆ వేళ ఎవరో వస్తున్నారని విని సంబరపడ్డాను. ఇందిరను తీసుకెళ్ళి కూచోబెట్టారు. ఏవేవో ప్రశ్నలు. ఏం చదువుతున్నావని, ఎంచేస్తున్నావనీ, వంటవగైరా వచ్చునా అనీ, సంగీత సాహిత్యాలలో అభిరుచి ఉన్నవా యని—అన్నీ అవసరం. అన్నీ అనవసరం. ఆ అమ్మాయిలో తనకు నచ్చిన గుణాలున్నాయో లేదో చూసుకుంటే చాలు. అంతేగాని ఆ అమ్మాయి సంగీత సర్వస్వాన్ని మథించి ఉన్నంత మాత్రాన చేసుకోవటం తెలివితక్కువ పని. సంగీతమంటే ఎంత ఇష్టమున్నా, ఇంట్లో కచేరీలు చేసే స్త్రీలను చేసుకోనక్కర్లేదు. సాహిత్యమంటే

ఎంత అభిరుచి ఉన్నా, సరస్వతిని తెచ్చి ఇంట్లో పెట్టుకోలేం! కావలసింది భార్య! అంతే!!

నా భావాలు ఇంకా ఒక కొలిక్కి రాకపూర్వమే ఒక బ్రహ్మాండమైన షాక్ తగిలింది. నాకు పెళ్లి కొడుకు తల్లి వచ్చి ఇందిర అమ్మతో అన్నమాటలను విని! ఆ అబ్బాయికి ఇందిరకన్నా జయంతి నచ్చిందట. జయంతినిస్తే తప్పకుండా చేసుకుంటాడుట.

చేసుకో వచ్చింది ఇందిరను, చేపడతానన్నది జయంతిని! ఇందిరను చూస్తే జాలి వెయ్యలేదుగాని జయంతిని చూస్తే మటుకు అదృష్టవంతురాలనిపించింది. ఇంట్లోవాళ్లు పెద్ద కూతురికి పెళ్లి కాకుండా రెండో కూతురి పెళ్లి అనేసరికి కొంత తటపటాయించినా, ఇందిరే పూనుకొని జయంతికీ, అతనికీ పెళ్లి జరిపించింది. జయంతి పెళ్లితోనే ఇందిర పెళ్లి చేద్దామని ఎంత ప్రయత్నించినా ఏ సంబంధమూ కుదిరి రాలేదు.

జయంతి పెళ్లయి ఏడేళ్లు అయింది—ఇద్దరు పిల్లలతల్లీ అయింది

ఇందిరకింకా పెళ్లి కాలేదు!!

జయంతి పెళ్లి తర్వాతే ఉద్యోగంలో చేరింది. ఇందిర చేరిందనే, నేనూ యింట్లో పోరి మరీ ఉద్యోగంలో చేరాను. ఉద్యోగమంటే ఏదో థ్రిల్ అనుభవిద్దామనుకొన్నా గానీ, చేరాక ఉత్త రొటీన్‌వర్కు కావడంతో బోర్ అనిపిస్తోంది. అంతమాత్రం చేత రిజైన్ చేస్తారా? ఊహూ.

ఇందిర వాళ్లమ్మగారు యింకా ఏదో చెబుతూనే ఉన్నారు. నేను వెళ్తానని చెప్పకుండా ఆ మాటలమీద కొంత అనాసక్తత ప్రదర్శించేసరికి ఆవిడే వెళ్లమన్నారు.

యింట్లోకెళ్లేసరికి ఇందిర అమ్మతో కబుర్లు చెబుతోంది. నన్ను చూసి నవ్వుతూ అంది—"ఏం చెప్పిందే అమ్మ?"

'నువ్వే అన్నావుగా, రామాయణం అని...' ఇందిర నేనూ బయలుదేరాం—'ఏమ్మా! బాగున్నావా?', 'సీతమ్మతల్లో ఎక్కడికి?', 'ఎన్నాళ్లు పెట్టారు సెలవు? వో వారం?,

....అందుకే నా కింత గర్వం. ఈ ఊళ్లో అడుగెట్టిన క్షణం నుంచి వెళ్లేంతవరకూ ప్రతివారు పలుకరిస్తూనే ఉంటారు. పంచాయితీ ఆఫీసు కెడుతూ ప్రెసిడెంట్ గారు, పొలాలకు ఎడ్లుతోలుకెడుతూ పాలేరు బూచిగాడు, స్కూలు మాస్టారు నిరంజనంగారు ... అందరూ అందరికీ ఆత్మీయులే!

ఈ రోడ్ల మీద నడుస్తోంటే ప్రాణం లేచొచ్చినట్లుంటుంది! ఈ కంకరకు కూడ నోచుకోలేదు, అయితేనేం ఆప్యాయతలతో ఆదరణలతో అలికినట్లుంటుంది.

పొలాల గట్లమీద నడుస్తోంటే అడిగాను—'ఎక్కడికి యిలాగ?'

'అదిగో, ఆ రావిచెట్టు నీడలో కూచుందాం' అంది ఇందిర.

కూర్చోగానే అడిగాను-యింకా అలస్యం దేనికి? చెప్పు'

నవ్వుతూ అంది ఇందిర- 'ముందు అమ్మ ఏం చెప్పిందో చెప్పు'

'ముందిది చెప్పు - రిజైన్ చేశావేందుకే?'

'అబ్బ, మొదలెట్టావ్ నువ్వు కూడ! అయినా దానిగురించి అందరికీ ఇంత ఇదిగా ఉందేం?

'ఉండదూ మరి—నీకంటే ఒళ్ళు పొగరు గనుక, కళ్ళకు పొరలున్నాయి కనుక యిదిగ ఉండదు. మా కవేం లేవుగా, అందుకే 'ఇంత ఇదిగ' ఉంది. అన్నాను నేను కోపంగ.

ఇందిర నవ్వుతూ అంది—'మరే పెద్ద ఆరిందాలా మాట్లాడకు. నా ప్రాణస్నేహితురాల్లా మాట్లాడు. నీ కూడా అలాగే అనిపించడం

వింతగనే ఉంది. ఒకటడుగుతా చెప్పు—జీవితాంతం ఉద్యోగం చేస్తూనే వుంటాననా మీ ఊహ?'

'కాదు, అలాగనిఉన్నదానికి నీళ్లొదులు కుంటావనీ అనుకోలేదు.'

'నిజం చెప్పొద్దూ, రిజైన్ చేద్దామని నిర్ణయించుకొనేంత వరకూ నాకు తెలీదు. నిర్ణయించుకొన్న రెండు రోజులలోనే యింటికివచ్చేశా '

'మంచిపని చేశావ్—' వెటకారంగ అన్నాను నేను.

'నిజమే, ఉద్యోగం వదిలేసిన తర్వాత నుంచీ ఇప్పటివరకూ అలాగే అనుకొంటున్నాను. కారణాలు తెలుసుకొంటే నువ్వూ అలాగే అంటావ్ !'

'దీనికి కొన్ని కారణాలు కూడ ఉన్నాయేమిటి ? ఒళ్ళు పొగరు, అంతే !'

ఇందిర అంత పెద్ద పెట్టున నవ్వడం నా జీవితంలో కనీ వినీ ఎరుగను. నవ్వాపుకొంటూ అంది– 'అమ్మ చెప్పింది బాగా వంటబట్టినట్లుంది నీకు–సీతా, ఉద్యోగం వదిలేయడం నాకు మాత్రం సరదాఅనుకొన్నావుటే రేదర్ అయామ్ ఫోర్స్డ్. యిలా చెబితే అర్థం గాదు నీకు, సరిగా చెబుతా విను! జయంతి పెళ్ళయి ఎన్నేళ్ళయిందంటావ్?'

నేనేం జవాబివ్వలేదు. నాకు ఇందిరంటే మహా తిక్కగా ఉంది.

'ఏడేళ్ళయిందా ? అసలు జయంతి భర్తను నా కోసం చూశారా ? పోన్లె ఈ ఏడెళ్ళలో నా పెళ్లే చేయలేకపోయారా?'

నా కర్థం కాలేదు 'అంటే?'

'అంటేనా ? నా మొహం. మా అమ్మకు, నాన్నకు నన్నొక ఇంటి దాన్ని చేసే ఊహే లేదంటున్నాను, తెలిసిందా?

తెలిసిందా? – లేదు. ఏమిటి దీని ఉద్దేశం?

'సీతా, ఏదో సరదాకు ఉద్యోగం చేద్దామనుకొని చేరానుకానీ అది నా జీవితానికే అడ్డొస్తుందనుకోలేదే? అమ్మా నాన్నలు ఇపుడెంతగ దిగజారి పోయారో తెలుసా? నెల నెలా నేను తెబోయే రెండు వందల యాభై రూపాయలకు మూడొందల రూపాయల ఖర్చు ఎదురుచూస్తుంది. మొదట్లో డబ్బు ఏం చేయాలో తోచక పంపేదాన్ని. ఇపుడు అప్పుడెందుకు పంపేదాన్నా అని ఏడుస్తున్నా — నీకు తెలీదు సీతా, నేను ఉద్యోగంలో ఉన్నంత కాలం నాకు పెళ్ళి జరగదు' ఇందిర కంఠం గద్గదంగా మారిపోయింది.

ఇందిర ఏం చెబుతుందో, ఆ చెప్పే దాంట్లో ఎంత ఇందిరకు అర్థమౌతోందో నాకయితే తెలీదు. కానీ ఇందిర యిలా అంటోందేం అసలు? ఇందిరకు పెళ్ళి చేయకూడ దనేదే వాళ్ళమ్మ నాన్నల ఉద్దేశమయితే వచ్చే మంగళవారం మాట ఏమిటి?'

ఇందిరకు యిది తెలీదు తెలిసి ఉండదు. తెలిస్తే యిదంతా జరగదు.

'గానీ ఇందూ, నీ కోసం సంబంధాలు చూస్తూనే ఉన్నారు గదే?'

'నాన్సెన్స్ చూసేవారు. యిపుడు మానుకున్నారు. జయంతి పెళ్ళి తర్వాత నాకు చూసిన సంబంధాలెన్నో తెలుసా? మూడు. జయంతి పెళ్ళయి ఏడేళ్ళయింది! చాలా? యింకా చెప్తాను విను, ఆ మూడింటిలోనూ ఒకతను నా కన్న పొట్టి. వరహీనమని వద్దన్నారు. మరొకతనికి నేను నచ్చినా, మేమిస్తామన్న కట్నం నచ్చలేదు. మరో రెండు వేలు యిస్తామంటే సరే అనేవాళ్లే! ఆ రెండువేలు వీళ్ళు యివ్వలేకపోయారటే? అంత దరిద్రంతో అల్లాడుతున్నారనుకోను. సరే ఆఖరిది — అతనెవరో గౌహతిలో ఉంటాడుట - అస్సాంలో అయితేనేం -అండమాన్స్‌లో అయితేనేం, కూడ పోవాల్సిన దాన్ని నేనయినప్పుడు వీళ్ళకేమిటి ?-ఉహూ.... ఇదంతా కుట్ర....

ఛీ—ఏమిటి ఇందిర యిలా అంటోంది ?

'అది కాదే ఇందూ....' నచ్చ చెప్ప బోయాను నేను.

'నువ్వు ఊరుకోవే సీతా ! వీళ్ళ కసలు యిపుడు డబ్బు పిచ్చి పట్టు కొంది. నా కిపుడు పెళ్ళి చేస్తారనుకో, వో పది పదిహేను వేలదాకా ఖర్చు. పై పెచ్చు నా జీతం యికనుంచి వాళ్ళాశించలేరు. ఔనా?.... అమ్మో, ఎంతగ ఆలోచించగలిగారే వీళ్ళు?'

ఆలోచించగలిగింది వాళ్ళుకాదు—ఇందిర.

యిదంతా ఇందిర కట్టుకొంటున్న కాకి గూడు.

ఇందిర చెబుతూనే ఉంది — 'అందుకేనే, అందుకే ఉద్యోగం వదిలేసి వచ్చేశా ! వీళ్ళకు కొంత డబ్బు మీద కాంక్ష తగ్గితే, నా పెళ్ళి జరిగే తీరుతుంది నాకా నమ్మకం ఉంది.'

నాకు నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు.

ఉద్యోగం వదిలేసినంత మాత్రాన పెళ్ళి చేయాలని ఉందా ? అడిగాను.

'గుండెలమీది కుంపటిలా వుంటే ఏం చేస్తారు? నీకు తెలీదేమో, కాసే చెట్టును ఎవరూ నరకరు — నా చేతిలోంచి డబ్బులు రాలకుంటే యింట్లోంచి తరిమేసి తీరతారు నాకు తెలుసు....'

నా కెందుకో ఏహ్యత జనించింది, ఇందిర మాటలు వింటూంటే.

పిచ్చిది—పిచ్చిది కాకపోతే యింకేమిటి ?

'ఒక్క విషయం చెప్పనిస్తావా నన్ను !

ఈ విషయాలన్నీ నీకై నువ్వే ఆలోచించు కున్నావా ? లేకపోతే ఎవరైనా ప్రవేశ పెట్టారా ?'

'అంతచిన్న పిల్ల నేమిటే ఎవరైనా ఏదో అంటే చేసేటందుకు?'

నవ్వొచ్చింది నాకు — 'కాదులే' మరీ పెద్దదానివై పోయినందుకే ఆశ్చర్యపోతున్నా. కన్న కూతుర్ని గుండెలమీద కుంపటిగ భావించే

తల్లిదండ్రులు నీకేడున్నారనుకునే స్థితికి ఎదిగిపోయిన నువ్వా చిన్నపిల్లవు పోనిద్దూ జరిగిందేదో జరిగింది కానీ నీ కొకటి చెబుతా, నా కేమిస్తావ్?'

'నీకా? ఆ మొగలిపువ్వువంటి....'నవ్వుతూ' అంది ఇందిర.

'నా సంగతి సరేగానీ, నీ కోసం మంగళవారం వస్తున్నారు తెలుసా ?'

....ఇందిర ఆశ్చర్యపోయింది. 'నిజం?'

'నువ్వు నమ్ము నమ్మకపో! మీ అమ్మా నాన్న నీవేడి భరించలేక సంబంధం చూశారు. యిది నీ అమోఘమైన తెలివితేటలకు బహుమానం' వెటకారంగా అన్న నాకు ఇందిర యిచ్చిన జవాబు ఆశ్చర్యాన్నే కలిగించింది- 'పోనీలేద్దూ, యిదన్నా కుదిరి వెళ్లిపోతే అంతే చాలు '

'నీ తొందరంతా పెళ్లి కోసమేనా ' లేకపోతే....'

'ఛీ, పోవే సిగ్గులేనిదానా' అంది ఇందిర నవ్వుతూ, అయినా ఈ సంగతులేవీ ఎవరితో అనకు'

నిజమే : కొన్ని సంగతులు మనతోనే మరణించాలి-అంతే : :

సోమవారంనాడు నేను ఆఫీసుకు వెళ్లాల్సి ఉన్నా మంగళవారం దాకా ఉండమని వాళ్ళమ్మగారు అడగటంతో సెలవు పొడిగించాను-ఆ పెళ్లి చూపులూ ఆ తతంగమూ కొంత ఎంజాయ్ చెయ్యచ్చుననీ : :

మంగళవారం నాకూ ఇందిరకూ మామూలుగా తెల్లవారలేదు.

ఇందిరను పెళ్ళి చూపులకు తయారుచేయటం, ఆ తర్వాత దాన్ని వేళాకోళం, వెక్కిరింతలతో ఉడికించటం - ఒంటరిగానే అనుకోండి - అంతా నాపనే అయింది. ఈ పనులలో నాకు జయంతి లోటు స్పష్టంగా కనిపిస్తూనే వుంది.

జయంతి కూడా వుండివుంటే బాగుండేది!!

వాళ్లొచ్చారన్నాక ఎవరికీ నేలమీద కాలు నిలవలేదు, అటు యిటు

తిరగను.... ఒకటే పనిలేని పని ! యధా ప్రకారం అన్నీ అడిగారు, చదువు, సంస్కారం. వంటావార్పూ. సంగీతం, సాహిత్యం.... నాకేమో యింటరెస్ట్ కలిగింది – యిదేదో కుదిరేలా వుంది !!

ఫార్మల్‌గా పెళ్ళి చూపులనేవి జరిగాక ఆషామాషిలోకి దిగారు. కాబోయే వియ్యపురాళ్ళు యిద్దరూ. అక్కడే కూర్చొని ఆ మాటలు వింటూ అక్కడే వుండిపోయాను. విషయం అటు తిరిగి, యిటు తిరిగి యిందిర మీదకే మళ్ళింది – ఉద్యోగం గురించి అడుగుతూ 'ఎన్నాళ్ళు పెట్టింది అమ్మాయి శెలవు ?' అనడిగారు.

యిందిర వాళ్ళమ్మగారు క్షణం ఆగి అన్నారు– 'సెలవుకాదులెండి, ఉద్యోగం మానేసింది !' నిర్వికారంగా నిర్లిప్తంగా అన్నట్లుంది.

ఆవిడ తెల్లపోయారు. 'అదేమిటండీ ! మా అబ్బాయికి ఉద్యోగం ఉన్న అమ్మాయినే చేసుకోవాలని వుంది. ఆ సంగతి స్పష్టంగా ముందు మీకు రాశాంకూడా....'

నేను యిందిరవైపు చూశాను – యిందిర నావైపు చూడ్డంలేదు. ఎక్కడో చూస్తోంది. యిద్దరం లేచి లోపలికి వెళ్ళాం....

'అతడికి ఉద్యోగం చేస్తున్న అమ్మాయి కాని అక్కర్లేదుట.... యిదంతా మా ఖర్మ....' యిందిర అమ్మ సణగడం, ఆవిడ మాటలు యిందిరమీద ఎలా పనిచేస్తాయో నేను ఊహించలేను .... ఊహిస్తే ముందు నా గుండెక్కు గాయం అవుతుంది. అది యిందిరను ఓదార్చే స్థితి కాదు. ఆ కళ్ళల్లో అప్పటికే నీళ్ళు నిండుకొన్నాయి. ఆ కన్నీటి సముద్రంలో నేను మునిగిపోతానని భయం వేసింది....ఆ గదిలో చీకటికీ, ఒంటరి తనానికి యిందిరను బలిపెట్టి నేను బయటకు నడిచాను.

[ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 28–1–72]